క్లుప్తంగా

మేడేను ఘనంగా నిర్వహిద్దాం

తెలకపల్లి: మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో చైతన్య భారతి పాఠశాల ఆవరణలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 1 నుంచి 7వ తేదీ వరకు ప్రతి గ్రామంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. లక్ష్మణ్, భాస్కర్ పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో వర్షం

అమ్రాబాద్: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. పరిసర గ్రామాలైన తెలుగుపల్లి, కల్ములోనిపల్లి, ఎల్మపల్లి, మొల్కమామిడి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో దుక్కులు దున్నుకోవచ్చని రైతులు తెలియజేశారు. వర్షాలు వచ్చే సూచనలు ఉండటంతో ఆలస్యంగా యాసంగి వేరుశనగ సాగు చేసిన రైతులు చేతికందిన పంట వర్షాలకు తడుస్తాయని ఆందోళన చెందుతున్నారు.

సత్యసాయి ఆరాధన దినోత్సవం

కందనూలు: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 12వ ఆరాధన దినోత్సవ కార్యక్రమాలు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజామున సత్యసాయి మందిరంలో పంచామృత అభిషేకాలను సత్య సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో బాబా వారి సామూహిక భజనలు నిర్వహించి, సత్యసాయి అన్నదాన పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన ప్రారంభించారు.

ఘనంగా బోనాలు



తాడూరు: మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలు నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి జగదీశ్వరాచారి తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తాడూరు: మండలంలోని మేడిపూర్‌కి చెందిన బీఎస్పీ, కాంగ్రెస్, బీజేపీ వివిధ పార్టీలకు చెందిన 45 మంది కార్యకర్తలు సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యార రమేష్, ఆయా గ్రామాల టీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిహారం అందజేయాలి

బిజినేపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్‌పీఎస్సీలో ఆయా పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు పేపర్ లీకేజీతో నష్టం జరిగిందని, వారికి రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి డిమాండ్ చేశారు. సోమవారం బిజినేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల వారీగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ నిరుద్యోగ మార్చ్ బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేశామని, నిరుద్యోగ యువత హాజరుకావాలని పిలుపునిచ్చారు. భూషయ్య పాల్గొన్నారు.

నర్సరీలను సంరక్షించాలి

చారకొండ: వేసవి దృష్టిలో పెట్టుకొని నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో సోమవారం నర్సరీని, పల్లెప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్లు విడుదల

తెలకపల్లి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకు నిరసనగా బీజేపీ నిరుద్యోగ మార్చ్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న టీటీడీ కల్యాణ మండపం నుంచి గడియారం చౌరస్తా వరకు నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రాచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్ విడుదల చేసినట్లు చెప్పారు. నరేంద్రాచారి, రమణారెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

తాడూరు: ఉమ్మడి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్‌ను బీజేపీ నాయకులు కొండా నాగేష్, లోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో విడుదల చేశారు.

బీఆర్‌ఎస్ అవినీతిని అంతం చేద్దాం

బల్మూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిని అంతం చేయాలంటే వారికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు డా.వంశీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. యాత్రలో కొండనాగులకి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, అనీల్, వెంకటయ్య, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

నిబంధనలపై నిర్లక్ష్యం వద్దు

- ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదికలో అడిషినల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి
- రూ.52 వేల జరిమానా, రూ.32,158 రికవరీకి ఆదేశాలు
- పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని సూచన



ప్రజావేదికలో ఈజీఎస్ సామాజిక తనిఖీల వివరాలను సమీక్షిస్తున్న అడిషినల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో నిర్దేశించిన విధంగా నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహించే టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరీ హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన 12వ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీల ప్రజావేదికలో ఏపీడీ పాల్గొని మాట్లాడారు. 2020 ఫిబ్రవరి 1వ తేది నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు ఈజీఎస్ నిధులు రూ.13.98 కోట్లతో మండలంలో చేపట్టిన 2062 పనులపై తనిఖీ బృందాలు గుర్తించిన తప్పిదాలను ప్రజావేదికలో వెల్లడించారు. మొదట గ్రామ పంచాయతీల వారీగా తనిఖీ చేసిన నివేదికలను డీఆర్‌పీలు చదివి వినిపించారు.

నిబంధనలు పాటించని..

రికార్డు పరంగా నిబంధనలు పాటించని తప్పిదాలను గుర్తించారు. వంద రోజులు పని పూర్తయి హాజరు లేక కూలీలకు డబ్బులు అందకపోవడం, జాబ్‌కార్డుల అప్‌డేషన్ చేయకపోవడం, పనుల వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, డాక్యుమెంటేషన్ వంటి తప్పిదాలను ప్రజావేదికలో వివరించారు. రూ.52 వేలు జరిమానాలు, తప్పిదాలకు సంబంధించి రూ.32,158లు రికవరీ చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ ఆదేశించారు. పొరపాట్లను మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఈజీఎస్ ఏపీఓకు, సిబ్బందికి సూచించారు. పనులకు సంబంధించి మూడు దఫాలుగా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. మెటీరియల్‌కు సంబంధించి రికార్డు పక్కాగా ఉండాలని సూచించారు. హరితహారంలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి అరుణ, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సర్పంచ్ కట్టా సరిత, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, అచ్చంపేట క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్, సీఆర్‌పీ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25 నుంచి హెచ్82–19 ఆర్టిజెన్‌ల యూనియన్ సమ్మెలోకి వెళ్తుందని విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ ఆపరేషన్ డీఈ శ్రీధర్ శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని సూచించారు. ఆర్టిజెన్‌లు చేసే పనులను ఇతర సంస్థల్లోని కార్మికులు, సిబ్బంది చేస్తారన్నారు. పనిలో నైపుణ్యం ఉన్న కార్మికులను వినియోగించుకునేందుకు చూస్తున్నామన్నారు. సమ్మెలో భాగంగా విద్యుత్ పరికరాల్లో అంతరాయం, గ్రామాల్లో సబ్ స్టేషన్లు, నియంత్రికలు, విద్యుత్‌లైన్ల వద్ద సమస్యలు సృష్టించే అవకాశం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ఫోన్‌లో చిత్రాలు, వీడియోలు తీసి సంబంధిత మండల ఏఈలకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నాగర్‌కర్నూల్ కంట్రోల్ రూం 9441400014 లేదా ఏడీఈ 9440813435 , అచ్చంపేట ఏడీఈ 9440813438, కొల్లాపూర్ ఏడీఈ 9440813442, కల్వకుర్తి ఏడీఈ 9440813437, నాగర్‌కర్నూల్ ఏడీఈ 9440813420 నెంబర్లకు చిత్రాలు, వీడియోలు షేర్ చేయాలని సూచించారు.

సమస్యలు సృష్టిస్తే చర్యలు

లింగాల: విద్యుత్ ఉద్యోగుల సమ్మె సమయంలో ఇతరులు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మల వద్ద సమస్యలు సృష్టిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లింగమ్మ

లింగాల: సమస్యలపై అధికారులు స్పందించకుంటే మూడు నెలలకు ఒక సారి జరిగే సమావేశాలకు అర్థమేమిటని మండల సమావేశంలో ఎంపీపీ లింగమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశంలో పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే కొత్త పనులు ఎలా చేయాలని, పనులకు చేసిన అప్పులు తీరడం లేదని క్యాంపు రాయవరం సర్పంచ్ శేషయ్య వాపోయారు. పెండింగ్ బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని పీఆర్ డీఈ భాషనాయక్ తెలిపారు. గతంలో చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో చెరువుల, కుంటల పనులు అసంపూర్తిగా ఉన్నాయని కోఆప్షన్ సభ్యుడు షఫీ ఆరోపించారు. చెరువులు, కుంటలు, నీటి పారుదల కాల్వలు పూర్తి చేయకపోవడంతో నీరు వృథాగా పోతుందని సభ్యులు తెలిపారు. ధరణి సమస్యలు ఇంకా తీరడం లేదని సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. వచ్చే సమావేశంలో నేడు తీర్మానించిన అంశాలను అమలు చేయాలని సభ్యులు కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, ఎంపీడీఓ గీతాంజలి, తహసీల్దార్ మునీరొద్దీన్, డీఎల్‌పీఓ వెంకటయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్యాంప్రసాద్‌రెడ్డి

ఉప్పునుంతల: గుండెపోటు వచ్చినప్పుడు, ప్రమాదాలు జరిగిన సమయంలో పల్స్ పడిపోయినప్పుడు మనిషి ప్రాణాలు నిలపడానికి సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసాసిటేషన్) సంజీవినిలా పనిచేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తారాసింగ్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక రైతు కేంద్రంలో సీపీఆర్‌పై ప్రజాప్రతినిధులకు, ఏఎన్‌ఎం, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, అన్ని శాఖల సిబ్బంది, ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ శ్యాంప్రసాద్‌రెడ్డి సీపీఆర్‌పై విపులంగా వివరించి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన సమయంలో మొదట అక్కడున్న పరిస్థితులను సరిచూసుకున్న తర్వాత ఆ మనిషికి సంబంధించిన పల్స్(నాడి కొట్టుకునే విధానం)ను పరిశీలించాలని చెప్పారు. ఒక వేళ పల్స్ ఆగిపోతే వెంటనే ఇంకొకరి సాయం తీసుకుని అంబులెన్స్ వచ్చేలోపు ఛాతి మధ్య భాగంగా రెండు చేతులతో బలంగా నొక్కడంతో పాటు నోటి ద్వార శ్వాస అందించాలని చెప్పారు. సదస్సులో ఎంపీపీ తిప్పర్తి అరుణ, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, కట్టా సరిత, ఎస్‌ఐ శేఖర్‌గౌడ్, స్వప్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని నిరసన



కల్వకుర్తిలో వినతి అందజేస్తున్న కార్యదర్శులు

వెల్దండ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ వెల్దండలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పోస్టుకార్డు ద్వారా ప్రగతి భవనానికి వినతి పత్రం పంపించారు. కార్యదర్శులు ఫయాజ్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, మంజుల, మురారి తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓకు వినతి

కల్వకుర్తి రూరల్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేపట్టేందుకు సిద్ధం అవుతున్నామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చెప్పారు. సోమవారం సమ్మె సన్నాహకంలో భాగంగా డెయిలీ సానిటేషన్ రిపోర్టు యాప్‌ను అనిన్‌స్టాల్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ దేవేందర్‌కు వినతి అందజేశారు.

పెద్దకొత్తపల్లి: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డికి వినతి అందజేశారు.

లింగాల: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కారం దిశగా చొరవ చూపాలని కోరుతూ మండలంలోని జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ లింగమ్మ, నారాయణగౌడ్, ఎంపీడీఓ గీతాంజలికి వినతి అందజేశారు.

ఉపాధ్యాయుడికి పలువురి నివాళి

లింగాల: మండల కేంద్రానికి చెందిన కాట్రావత్ హతిరాంనాయక్ ఆదివారం సాయంత్రం బల్మూర్ మండలం కొండనాగుల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి.. సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు స్వగ్రామానికి చేరుకుని నివాళి అర్పించారు. సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, బీజేపీ నియోజకవర్గ నాయకులు సతీష్‌మాదిగ, మంగ్యానాయక్, బంజార సేవా సంఘం నాయకులు నివాళి అర్పించారు.

సర్టిఫికెట్ల పంపిణీ

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రై సౌజన్యంతో ఎస్వీకే నిర్వహించిన కంప్యూటర్ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లను సోమవారం విద్యార్థులకు అందజేశారు. హన్మంత్‌రెడ్డి, తాహెర్‌పాషా, ఎస్వీకే ఎంసీఓ మన్సూర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

అచ్చంపేట రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

వెల్దండ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ సమీపంలో పైపులైన్ నిర్మాణంలో ఇర్లపల్లి రాజుపై బాదేపల్లి కొండల్, మణికంఠ సోమవారం దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇర్లపల్లి రాజు పైపులైన్ నిర్మాణం చేస్తున్నారు. పక్క ఇంటి వ్యక్తి కొండల్, మణికంఠ మాటమాట అనుకొని దాడిచేశారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఈఓకు ఫిర్యాదు

తెలకపల్లి: ఇనాం భూమి అన్యాక్రాంతం అవుతుందని ఈఓకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రం తెలకపల్లిలోని పెద్దచెరువు సమీపంలోని ఈదమ్మ దేవాలయం వద్ద సర్వే నంబర్ 506లో 4 ఎకరాల 20 గుంటల ఇనాం భూమి ఉందని ఈదమ్మ దేవాలయ నిర్వాహకులు, భక్తులు సోమవారం ఈఓ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతి అందజేసిన వారిలో శ్రీను, తిరుపతయ్య, శ్రీరాములు, నర్సింహ ఉన్నారు.

ప్రజావాణికి ఒక దరఖాస్తు

పెద్దకొత్తపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక దరఖాస్తు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కేవలం 6 శాఖల అధికారులు మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యారు. హాజరు కాని శాఖలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ తెలియజేశారు.

కాకినాడకు తరలిన నాయకులు

కల్వకుర్తి రూరల్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దళితుల హక్కుల పరిష్కారంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడలో తలపెట్టిన మాలల యుద్ధభేరి బహిరంగ సభకు కల్వకుర్తి నుంచి మాల మహానాడు నాయకులు సోమవారం కాకినాడకు తరలివెళ్లారు. ఆవుల శ్రీనివాస్, మహిళా సంఘం నాయకులు సభకు వెళ్లారు.

ఉపాధి పనుల పరిశీలన

కల్వకుర్తి రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. సోమవారం మండలంలోని యంగంపల్లిలో కూలీలు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఏపీఓ చంద్రసిద్ధార్థ్ పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువపత్రం అందజేయాలి

తాడూరు: మండల కేంద్రంలో సోమవారం కురువ కమ్యూనిటీ భవనంలో మాదాసి మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లింగం మాట్లాడారు. తమను ఎస్సీ జాబితాలో కలిపేందుకు ప్రభుత్వం జీఓలు ఇచ్చినా.. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి గ్రామంలో కమిటీలు వేసి కమిటీల ద్వారా పోరాటం ఉధృతం చేస్తామన్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా మల్లేష్, బీరయ్య, కార్యదర్శిగా సైదులు, కోశాధికారిగా వెంకటయ్య తదితరులు ఎంపికయ్యారు.

డ్రైవర్లకు గాయాలు

తెలకపల్లి: రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ నుంచి తెలకపల్లి వైపు వస్తున్న ట్రాక్టర్, ఆటో అనంతసాగర్ గేట్ సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో వాహనాల డ్రైవర్లకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారిని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని, వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం

కొల్లాపూర్: పాఠ్యపుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతం తొలగింపు అంశం ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలో భాగమేనని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో మూఢనమ్మకాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే పాఠ్యపుస్తకాల్లో శాస్త్రీయ, విజ్ఞానానికి సంబంధించిన అంశాలను తొలగించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు.

బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: నియోజకవర్గంలో భాగంగా ఆమనగల్లు పట్టణంలో నిర్వహించే బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తునారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ప్రజల మద్దతు లేదని విమర్శించారు. భూపతిరెడ్డి, దార్ల కుమార్, జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, కాడురామ్, సాజ్యనాయక్ ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలి

ఉప్పునుంతల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ శ్రేణులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు అన్ని గ్రామాల్లో పార్టీ జెండా విష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆనంద్

తెలకపల్లి: పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు కావడంతో సోమవారం గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు ఆరో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వారు పరీక్షల్లో సాధించిన మార్కుల ప్రగతి పత్రాలను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. విద్యార్థులంతా భవిష్యత్‌లో ఉన్నత చదువు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుకోవడానికి తోడ్పాటునందించాలన్నారు. ఎంఈఓ చంద్రుడుతో పాటు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

పెంట్లవెల్లి: మల్లేశ్వరం యూపీఎస్ లో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఫైనల్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా శాలువాలతో సన్మానించారు.

తాడూరు: ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తాడూరు పాఠశాల హెచ్‌ఎం కోరారు. సోమవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సెలవుల్లో పుస్తక పఠనం అలవరుచుకునేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటయ్య, శివలీల, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

29న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లాపూర్: హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ఈ నెల 29న ముట్టడించనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ వెల్లడించారు. హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో కమిషనర్ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నట్లు చెప్పారు. కమిషనర్ కార్యాలయం ముట్టడి పోస్టర్లను ఆవిష్కరించారు.

వాల్‌పోస్టర్లు విడుదల

నాగర్‌కర్నూల్ రూరల్: అన్ని రకాల హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బజార్ హమాలీల కార్యాలయంలో ఈ నెల 29న నిర్వహించే లేబర్ కార్యాలయ ముట్టడి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. యూనియన్ అధ్యక్షుడు వెంకటస్వామి, మోహన్, నరేష్, ధర్మ, తిరుపతి, మల్లేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక



రాంచందర్‌జీ

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లికి చెందిన కవి అధ్యాపకులు రాంచందర్‌జీ కి జాతీయ సాహిత్య సంబరాల నుంచి ఆహ్వానం లభించింది. ఈ నెల 30న హైదరాబాద్‌లోని తెలుగు వెలుగు సాహిత్య వేదిక, యస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణ రావు, రాంచందర్‌జీ కి వ్యక్తి గత పురస్కారం, వండర్ వరల్డ్ రికార్డు ధ్రువపత్రాల ప్రదానం జరుగుతుందని ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా రాంచందర్‌జీకి తోటి అధ్యాపకులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కోడేరు: మండల కేంద్రం కోడేరుతో పాటు జనుంపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ చిన్నారెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు యాసంగిలో పండించిన వరిధాన్యాన్ని మధ్యదళారులు ఆశ్రయించకుండా వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఈఓ ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, ఎంపీటీసీ దేవమ్మ, ఆది కొమ్ము దానయ్య, శ్రీరాం, నర్సింహారెడ్డి, ఏఈఓ మధు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్, గోపులాపురం గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కె ఖాజా, గౌస్‌ద్దీన్, శోభారాణి పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి నిరసన



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు



వెల్దండలో..

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని 8 రోజులుగా సమ్మె బాట పట్టారు. సోమవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్

ఆరాధనోత్సవాలు జయప్రదం చేయండి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 30న ఆదివారం ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగాచారి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధనోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అచ్చంపేటలో పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య గౌడ్ కోరారు. సోమవారం మండలంలోని పంజుగుల పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో దేశ నాయకుల జీవిత చరిత్రలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. రాఘవేందర్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

తాడూరు: మండలంలోని మేడిపూర్, అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని 200 మంది విద్యార్థులకు పుస్తకాలను గ్రామానికి చెందిన నవ్య, కిరణ్‌ల సహకారంతో అందజేసినట్లు మండల ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటేష్ తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.